క్లుప్తంగా

ఉచిత బస్సు ఎప్పుడు?



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యకర్తలు

బొబ్బిలి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడు కల్పిస్తారని కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.పద్మావతి ప్రశ్నించారు. ఇదే విషయమై స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మహిళలతో కలిసి శనివారం మాట్లాడిన ఆమె.. ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఉచిత బస్సు హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు ఉచిత బస్సు ప్రయాణ హామీని వెంటనే నెరవేర్చాయని, ఇక్కడ అమలు చేయకపోవడానికి కారణాలేంటని నిలదీశారు. కాలయాపన చేయకుండా వెంటనే సూపర్ సిక్స్ పేరిట ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు. ఆమె వెంట ఆ పార్టీ మహిళా కార్యకర్తలు శ్రీలక్ష్మి, పార్వతి, మంగతాయారు, సుధ, రాణి తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రమణ, తదితరులు

బొబ్బిలిరూరల్: రాష్ట్ర స్థాయి చెస్(చదరంగం) పోటీలకు మండలంలోని పెంట గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి లచ్చుపతుల చరణ్‌రాజ్ ఎంపికయ్యాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి అండర్–14 చెస్ పోటీల్లో సదరు విద్యార్థి పాల్గొని, విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు చింతా రమణ తెలిపారు. ఆ విద్యార్థిని ఉపాధ్యాయ సిబ్బంది అంతా శనివారం అభినందించారు.

నేత్ర శస్త్రచికిత్సకు 15 మంది ఎంపిక



నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: పట్టణంలోని గాయత్రి కాలనీలో ఉన్న హోసన్నా చర్చిలో ఉచిత నేత్ర వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. శిబిరానికి హాజరైన వారందరి కళ్లను విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 30 మందిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు. వారిలో 15 మందిని శస్త్రచికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



ఎముకల సాంద్రతను పరీక్షిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: పట్టణంలోని సన్‌రైజ్ ఆస్పత్రి వద్ద వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత బీఎండీ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన వారికి డాక్టర్ తలే రాజేష్ ఉచితంగా ఎముకల సాంద్రత పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఆస్టియో పోరోసిస్ డే సందర్భంగా ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

ఆస్పత్రికి రోగుల తాకిడి



రాజాం ఏరియా ఆస్పత్రిలో క్యూలైన్‌లో జ్వర పీడితులు

రాజాం: స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి ఎక్కువైంది. సీజనల్ జ్వరాలతో బాధపడుతున్న చాలామంది ఆస్పత్రికి చేరుకుని, పరీక్షలు చేయించుకుంటున్నారు. కొంతమంది అయితే ఏకంగా ఆస్పత్రిలో చేరి చికిత్స పొంది కోలుకున్న తర్వాతనే ఇంటికి వెళ్తున్నారు. కొంతమంది అయితే ఏకంగా గతంలో గ్రామాల్లోనే 104 వాహన సేవలు సక్రమంగా అందేవని, ఇప్పుడు ఆ సేవలు అంతగా లేనందు వల్లనే ప్రతీ చిన్న సమస్యకు ఆస్పత్రికి రావాల్సి వస్తోందని చెబుతున్నారు.

‘పచ్చ’బ్యాచ్‌లో మద్యం చిచ్చు!

- గ్రూపు తగాదాలతో పక్క పక్కనే వైన్ షాపుల ఏర్పాటు
- మద్యం విక్రయాలకు పోటీపడుతున్న టీడీపీ నేతలు
- ఇదే అదునుగా గ్రామాల్లో బెల్ట్ షాపులకు వ్యాపారుల యత్నం
- తమ దగ్గరే కొనాలని పట్టుబడుతున్న షాపు యజమానులు
- నూతన మద్యం పాలసీతో కూటమిలో మరింత బయటపడిన విభేదాలు



రామభద్రపురంలో రాజాం రూట్‌లో కూటమి నేతలు పక్కపక్కనే ఏర్పాటు చేసిన వైన్ షాపులు

రామభద్రపురం: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లే రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టింది. ఈ మేరకు ప్రైవేటు వైన్ షాపుల ఏర్పాటుకు భారీగా అనుమతులు ఇచ్చింది. నియోజకవర్గానికి మొత్తం 23.. అందులో రామభద్రపురం మండలానికి 6 మద్యం షాపులు మంజూరయ్యాయి. మండలానికి చెందిన ఆరు షాపుల్లో నాలుగు కూటమి నేతలకు దక్కగా, మిగిలిన రెండు ఇతర ప్రాంతాల వారికి దక్కాయి. ఇప్పటి వరకు అంతా బాగానే ఉంది. అయితే అప్పటికే మండలంలోని కూటమి నేతలు మూడు నుంచి నాలుగు గ్రూపులుగా ఏర్పడి, ఎవరికి వారే యమునా తీరే అనేలా వ్యవహరిస్తున్నారు. ఒకరినొకరు ముఖాలు చూసుకోకుండా మరీ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఒక గ్రూపు వారు.. మరో గ్రూపు వద్దకు వెళ్లడం లేదు. మద్యం దుకాణాల విషయంలో కూడా మూడు గ్రూపులు వేర్వేరుగా దరఖాస్తులు చేసుకున్నారు. ఈ గ్రూపుల్లో ఓ గ్రూపునకు రెండు షాపులు దక్కగా, మిగిలిన రెండు గ్రూపులకు ఒక్కో షాపు లెక్కన లాటరీ ద్వారా వచ్చాయి. ఇది వారి గ్రూపు తగాదాలకు మరింత ఆజ్యం పోసింది. వారిలో వారికే చిచ్చు పెట్టింది. రామభద్రపురంలోని రాజాం రూట్‌లో రెండు గ్రూపులకు చెందిన వారు పోటాపోటీగా మద్యం దుకాణాలు పక్కపక్కనే పెట్టి అమ్మకాలు చేపడుతున్నారు. రండి బాబు రండి తమ వద్దనే కొనుక్కొని తాగండి అని పిలుస్తున్నట్లు పోటీపడి మరీ విక్రయిస్తుండడం కనిపిస్తోంది. కొత్త మద్యం పాలసీ కూటమి నేతల్లోని విభేదాలను మరింత బయటపడేలా చేసిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

బెల్టు షాపు ఏర్పాటుకు సిద్ధం..

మద్యం దుకాణాలు దక్కించుకున్న కూటమి నేతల్లో మద్యం విక్రయాల్లో కూడా పోటీ రావడంతో అదే అదునుగా గ్రామాల్లో సైతం బెల్టు షాపుల ఏర్పాటుకు అక్రమ వ్యాపారులు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని వీధివీధిన ఉన్న చిన్న చిన్న దుకాణాల్లో ఇప్పటికే మద్యం విక్రయాలు జరుగుతుండగా, చాలా గ్రామాల్లో మద్యం బెల్టు షాపుల ఏర్పాటుకు వేలంపాట నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మద్యం షాపు యజమానులు కూడా ఎలాగైనా దుకాణాలు దక్కించుకునేందుకు 30 అప్లికేషన్లు వేశామని కొందరు.. 20 అప్లికేషన్లు వేశామని మరికొందరు అంటున్నారు. దరఖాస్తులు ఎన్ని వేసినా తమకు వచ్చినవి ఒకట్రెండేనని గగ్గోలుపెడుతున్నారు. ఒక్కో షాపు వద్ద రోజుకు రూ.2 లక్షలకు పైబడి మందు విక్రయిస్తేనే పెట్టిన సొమ్ము వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున పోగొట్టుకున్న వారికి ఆ నగదు మొత్తాన్ని మళ్లీ రాబట్టుకోవాలన్నా.. ఒక్కో షాపు దగ్గర రోజుకు రూ.2 లక్షలకు పైబడి విక్రయించాలని, అలా జరగాలంటే గ్రామాల్లో తప్పకుండా బెల్టు షాపుల ఏర్పాటు జరిగితేనే గానీ సాధ్యం కాదన్న అభిప్రాయంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో గ్రూపులుగా మద్యం విక్రయాలు చేపడుతున్న కూటమి నేతలు సైతం తమ వద్దనే మద్యం పట్టుకువెళ్లి, అమ్ముకోవాలని బెల్టు షాపుల నిర్వాహకులకు ఫోన్లు చేసి మరీ సూచనలిస్తున్నట్లు సమాచారం.

● మద్యంప్రియుల ఆగ్రహం..

నూతన మద్యం పాలసీ తీసుకువచ్చి, తక్కువ ధరకే మద్యం విక్రయిస్తామని చెప్పిన చంద్రబాబు ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయించి, మళ్లీ పాత ధరలకే మందు విక్రయిస్తుండడంపై మద్యంప్రియులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 180 ఎంఎల్ మద్యాన్ని రూ.99కే ఇస్తామని చెప్పి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఇప్పుడు మరోసారి మాట మార్చి పాత ధరల ప్రకారమే మందు విక్రయాలు చేపడుతుండడంపై మందుబాబులు కోపంతో ఊగిపోతున్నారు. ధరలు ఎప్పుడు తగ్గిస్తారని ప్రశ్నిస్తున్నారు.

బెల్ట్ షాపులపై కఠిన చర్యలు..



గ్రామాల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాల ఏర్పాటుతో పాటు మద్యం విక్రయాలు జరపాలి. ప్రస్తుతం తాత్కాలిక లైసెన్స్‌లు ఇచ్చాం. కొన్నాళ్ల తర్వాత అన్ని నిబంధనలకు లోబడి ఉంటేనే శాశ్వత అనుమతులిస్తాం. బెల్టు దుకాణాలు నిర్వహిస్తూ 5 సార్లు కంటే ఎక్కువ సార్లు పట్టుబడిన వారిపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తాం.

– పి.చిన్నంనాయుడు, ఎక్సైజ్ సీఐ, బొబ్బిలి

● నిర్మానుష్యం



శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో జనసంచారం లేని బొబ్బిలి ఫ్లైఓవర్ బ్రిడ్జి రోడ్డు

వర్షాకాలంలోనూ వేసవిని తలపించే ఎండలు కాస్తుండడంతో ఇంటి బయట కాలు మోపాలంటే జనం భయపడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత విపరీతంగా ఉంటుండడంతో అత్యవసరమైతే తప్ప జనాలెవ్వరూ బయటకు వచ్చేందుకు ఇష్టపెట్టుకోవడం లేదు. మధ్యాహ్నం 3 గంటల వరకు జనసంచారం అంతగా లేకపోతుండడంతో ప్రధాన రోడ్లు, వీధులు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. – బొబ్బిలి

● జనావాసాల వద్ద మద్యం దుకాణాలు వద్దు



రాత్రి అయినా నిరసన కొనసాగిస్తున్న మహిళలు, (ఇన్‌సెట్లో) మహిళలతో చర్చిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

జనావాసాల వద్ద మద్యం దుకాణాల ఏర్పాటును వ్యతిరేకిస్తూ బొబ్బిలి పట్టణంలోని మేదరబంద ప్రాంత మహిళలు శనివారం నిరసనకు దిగారు. అక్కడ దగ్గరలోనే ఓ కాన్వెంట్, చర్చి ఉండగా, అక్కడే మద్యం షాపు కూడా నిర్వహిస్తుండడంతో వారంతా ఆందోళనబాట పట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే ఉండి, తక్షణమే దుకాణాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. ఇక్కడి షాపును వేరేచోటకు మార్చినంత వరకు నిరసన కొనసాగుతుందని హెచ్చరించారు. ఇదే విషయమై ఎమ్మెల్యే బేబీనాయనను మహిళలంతా కలిసి విన్నవించడం గమనార్హం. – బొబ్బిలి

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



సంతకవిటి: జానకీపురం గ్రామసభలో రెవెన్యూ సిబ్బంది



బాడంగి: రైతుల భూ సమస్యలు తెలుసుకుంటున్న రెవెన్యూ అధికారులు

వంగర: భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని తహసీల్దారు తహసీల్దారు దిరిశాల ధర్మరాజు అన్నారు. మండలంలోని మద్దివలస గ్రామంలో గ్రామసభ శనివారం నిర్వహించారు. గతంలో జరిగిన భూముల రీసర్వేలో ఎవరి భూములకు సంబంధించి అయినా పొరపాట్లు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికే ప్రత్యేకంగా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయవలస గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో తహసీల్దారు డి.ఎల్లారావు పాల్గొని, గ్రామసభల్లో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. గతంలో జరిగిన భూముల రీసర్వేలో భూ వివరాల్లో తప్పులు ఉంటే దరఖాస్తు చేసుకుని, పరిష్కరించుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీలు శ్రీనివాసరావు, చిన్నారావు, వీఆర్వో రామకృష్ణ, సర్పంచ్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని జానకీపురంలో శనివారం గ్రామసభ నిర్వహించి, భూ విస్తీర్ణం, సర్వే నంబరు, పాస్‌బుక్‌ల్లో ఫొటోల్లో తేడాలున్నా సర్వే చేస్తామని రీ సర్వే డీటీ బి.మధు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ అప్పలనాయుడు, విలేజ్ సర్వేయర్ వాసు, వీఆర్వో పట్టాభి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని కృష్ణంవలస గామంలో సోమవారం గ్రామసభ నిర్వహిస్తున్నట్లు సర్వేయరు జయంతి తెలిపారు.

బాడంగి: మండలంలోని తెంటువలస గ్రామంలో సర్పంచ్ తెంటు చిరంజీవిరావు అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. గతంలో జరిగిన భూముల రీసర్వేలో ఏవైనా తప్పుంటే వాటిని సరి చేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాలని రైతులకు తహసీల్దారు కె.సుధాకర్ సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు వెంకటరమణ, వీఆర్వో ప్రసన్నలక్ష్మి, విలేజ్ సర్వేయరు మాధురి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

బాడంగి: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేశారు. ఆకులకట్టలో రూ.20 లక్షలు, ఆనవరంలో రూ.14.9 లక్షలు, పినపెంకిలో రూ.15 లక్షలు, రేజేరులో రూ.25 లక్షలు, పాల్తేరులో రూ.20 లక్షలు, పి.వెంకంపేటలో రూ.15 లక్షలు, వాడాడలో రూ.30 లక్షలు, కోటిపల్లిలో రూ.15 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని, 2025 జనవరిలోగా పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు.

పల్లె పండగకు స్పందన కరువు..

రామభద్రపురం: మండలంలో నిర్వహిస్తున్న పల్లె పండగకు స్పందన కరువైంది. మండల స్థాయి అధికారులు తప్ప గ్రామ నాయకులు గానీ, గ్రామస్తులు గానీ అంతగా కార్యక్రమానికి హాజరుకావడం లేదు. దీనికి శనివారం ముచ్చర్లవలస, బూసాయవలస గ్రామాల్లో జరిగిన పల్లె పండగ కార్యక్రమమే నిదర్శనం. ఆయా గ్రామాల్లో ఎంపీడీవో రత్నం, కార్యదర్శి పార్థసారధి, సచివాలయ సిబ్బంది మాత్రమే కార్యక్రమానికి హాజరై, పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఇదే కార్యక్రమంపై ఆయా గ్రామాల నాయకులు, ప్రజలకు ముందస్తుగా తెలియజేసినా వారు అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వెంకటరమణ, ఏపీవో త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.



కోటిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

బ్యాంకు ఎత్తేశారు!

రాజాం: పట్టణంలోని జీఎంఆర్ ఐటీ వద్ద పదేళ్లుగా సేవలందించిన యూనియన్ బ్యాంకు బ్రాంచిని అధికారులు ఎత్తేశారు. ఖాతాదారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఇక్కడి బ్రాంచిని ఎత్తివేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరిగ్గా రెండు నెలల క్రితం రాజాంలోని సంపత్ భవన్ ఎదురుగా ఉన్న ఆ బ్యాంక్ మెయిన్ బ్రాంచిలో ఇక్కడి బ్రాంచిని విలీనం చేశారు. చాలామంది బ్యాంకు అక్కడే ఉందనుకుని రావడం, తిరిగి వెనక్కి వెళ్లిపోవడం జరుగుతోంది. ఎప్పుడు వచ్చినా బ్యాంకు మూసే ఉండడంతో చుట్టుపక్కల వారిని ఆరాతీస్తున్నారు. ఫలానా దగ్గర ఉందని తెలుసుకుని, పరుగులు తీస్తున్నారు. బ్రాంచి మార్చేటప్పుడు కనీసం ఖాతాదారులకు సమాచారం ఇవ్వాలని కదా ఇలా చేస్తే ఎలా అని పలువురు అంటున్నారు.



జీఎంఆర్ఐటీ వద్ద గతంలో నిర్వహించి, ప్రస్తుతం మూసేసిన యూనియన్ బ్యాంకు

అధిక ధరకు విక్రయించొద్దు

రేగిడి: ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎరువులను అధిక ధరలకు విక్రయించవద్దని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న ఎరువుల దుకాణాల్లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నాణ్యతతో పాటు ఎరువుల కాలం చెల్లిన తేదీలను పరిశీలించారు. నిబంధనలు అతిక్రమిస్తూ ఎరువుల విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘మత్తు’తో జీవితాలు చిత్తు

రాజాం సిటీ: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తుపదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని, వాటి బారిన పడొద్దని ఎస్ఐ ఆర్.నర్సింహమూర్తి సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక వేదగాయత్రి కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాలు–వాటి దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ వయసులో ఎక్కువగా ఆకర్షణకులోనై చాలా మంది చెడు అలవాట్లకు బానిసలై తమ జీవితాలను అధోగతి పాలుచేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. చెడు వ్యవసనాలకు బానిసైన వ్యక్తి చనిపోవడం ద్వారా ఆయన జీవితంతో పాటు ఆయన నమ్ముకుని ఉన్న కుటుంబ సభ్యుల జీవితాలు కూడా రోడ్డున పడతాయన్నారు. విద్యార్థులంతా సద్బుద్ధి, క్రమశిక్షణతో చదువుకుని, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

మత మార్పిడిలు అరికట్టాలి

బొబ్బిలిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న మత మార్పిడిలను అరికట్టాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మండలంలోని పిరిడి గ్రామ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బొబ్బిలి, బలిజిపేట, తెర్లాం, బాడంగి గ్రామాల ధర్మప్రచారక్‌ల సమావేశం శనివారం జరిగింది. డివిజన్ ధర్మ ప్రచారక్ దూపం వాసు, జిల్లా ప్రచారక్ నరసింగరావులు మాట్లాడుతూ బలవంతపు మతమార్పిడిల పట్ల అప్రమత్తగా ఉండాలన్నారు. ప్రలోభాలకు లొంగవద్దన్నారు.

రుచి, శుచి కలిగిన భోజనం అందివ్వాలి



రాజాం: మధ్యాహ్న భోజనం రుచి చూసి పరిశీలిస్తున్న ఎంఈవో దుర్గారావు



తెర్లాం: విద్యార్థుల హోంవర్క్ పుస్తకాలు పరిశీలిస్తున్న ఎంఈవో త్రినాధరావు

రాజాం: విద్యార్థులకు రుచి, శుచి కలిగిన భోజనం అందివ్వాలని ఎంఈవో యాగాటి దుర్గారావు తెలిపారు. స్థానిక పట్టణ పరిధిలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వండిపెట్టాలని, తాగడానికి కాచివడపోసిన నీటిని అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆహారం అందివ్వాల్సిన బాధ్యత మనదేనని ఉపాధ్యాయులకు తెలిపారు. అనంతరం వంటకాలు రుచి చూసి, రుచి, శుచిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

బొబ్బిలి: పట్టణంలోని గురుకుల పాఠశాలతో పాటు అంధుల పాఠశాలను సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ శనివారం సందర్శించారు. అక్కడి తరగతుల నిర్వహణ, ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, వారికి అందిస్తున్న భోజనం, కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. పిల్లలకు నాణ్యమైన విద్యనందివ్వాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం ఇవ్వాలని తెలిపారు.

తెర్లాం: విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని ఆమిటి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందివ్వాలని తెలిపారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచకపోతే స్కావెంజర్‌లపై చర్యలకు వెనుకాడేదిలేదని ఆయన హెచ్చరించారు. అంతకుముందు తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, హోంవర్క్ పుస్తకాలను పరిశీలించారు.

సంక్షిప్తంగా...

వాహన తనిఖీలు

వంగర: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్‌లు, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు లేనివారికి అపరాధ రుసుం విధించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని సూచించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలన్నింటినీ వెంట తీసుకురావాలన్నారు.

వితరణ

బొబ్బిలిరూరల్: మండలంలోని కోమటిపల్లి గ్రామ అన్నపూర్ణ ఆపన్న హస్తం సంస్థ నిర్వాహకులకు ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోత్తమరావు శనివారం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. నిరుపేదలకు దుస్తులు, నిత్యావసరాలు అందజేస్తూ సాయపడుతున్న సంస్థకు తమవంతు సాయం చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. రూ.4 వేల విలువైన సామగ్రి అందించామన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

తెర్లాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, కిశోరి బాలికలంతా తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం–5లో పౌష్టికాహారం ప్రయోజనాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రతిరోజూ మనం తీసుకునే ఆహారంలో పౌష్టికాహారం తప్పనిసరిగా ఉండేలా చూడాలని, పౌష్టికాహారం తీసుకోకపోతే అనారోగ్య పరిస్థితులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అనారోగ్యం బారినపడకుండా ఉండాలంటే మనం తినే ఆహారంలో పౌష్టికాహార పదార్థాలు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా గృహాధారిత విద్యనందించాలి

తెర్లాం: సహిత విద్యలో భాగంగా దివ్యాంగ విద్యార్థులకు గృహాధారిత విద్యను సక్రమంగా అందించాలని ఐఈఆర్‌టీలకు ఎంఈవో జె. త్రినాధరావు సూచించారు. మండలంలోని కూనాయవలస గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న హోమ్ బేస్డ్ విద్యార్థి నితిన్ ఇంటికి ఆయన శనివారం వెళ్లి, సదరు విద్యార్థికి అందిస్తున్న గృహాధారిత విద్యపై ఆరాతీశారు. ప్రతీ శనివారం దివ్యాంగ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, వారి ఆరోగ్య పరిస్థితి, విద్యా ప్రగతిని తల్లిదండ్రులను అడిగి తెలుసుకోవాలని ఐఈఆర్‌టీ సూర్యారావును ఆదేశించారు. నితిన్ ఆరోగ్య పరిస్థితి, విద్య పట్ల స్పందిస్తున్న తీరుపై ఎంఈవో సంతృప్తిని వ్యక్తం చేశారు.

తూటికాడ కషాయం తయారీపై అవగాహన

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ పాత్రుని వెంకటరమణ తొలుత తూటికాడ కషాయాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేసి, చూపించారు. అనంతరం దాని ప్రయోజనాలు వివరించారు. తూటికాడ కషాయం పిచికారీ చేయడం ద్వారా పంటకు పట్టే తెగుళ్లు, చీడపీడలు నివారించవచ్చన్నారు.

చురుగ్గా సీసీ కాలువల నిర్మాణం

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామ ఎస్సీ కాలనీలో సీసీ కాలువల నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతోంది. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ కాలువలు నిర్మిస్తున్నట్లు సర్పంచ్ పట్టాభి తెలిపారు. మురుగునీటి నిల్వలు ఉండకుండా కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు.

రోజుకు ఒక్క ట్రాక్టరుకే అనుమతి

రామభద్రపురం: స్థానిక అవసరాలు, వ్యక్తిగత అవసరాల నిమిత్తం రోజుకు ఒక్క ట్రాక్టరు ఇసుక తీసుకువెళ్లేందుకే అనుమతి ఉందని తహసీల్దారు సులోచనరాణి తెలిపారు. ఇదే విషయమై ఆమె మండల కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం మాట్లాడారు. ఎడ్లబళ్లతో ఎంత ఇసుక అయినా తీసుకువెళ్లవచ్చని, ట్రాక్టర్లు, లారీల్లో ఇసుక తరలించేందుకు పరిమితులు ఉన్నాయన్నారు. కమ్యూనిటీ, వ్యక్తిగత అవసరాలకు గ్రామ పంచాయతీల పరిధిలోని ఇసుక, మట్టిని తవ్వి తీసుకెళ్లడానికి పర్యావరణ అనుమతులు అవసరం లేదన్నారు. ట్రాక్టర్లతో ఎక్కువగా తరలించి, వ్యాపారాలు చేస్తామంటే కుదరదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.